క్లుప్తంగా

సంస్కృతి, సంప్రదాయాలు పాటించడం అభినందనీయం



గుస్సాడీలతో జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి

తలమడుగు: ఆదివాసీలు సంస్కృతి, సంప్రదాయాలను పాటించడం అభినందనీయమని జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని లచ్చంపూర్, పల్లి (బి), నందిగామ, సకినాపూర్, నడింపల్లి గ్రామాల్లోని నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. ఇప్పటికీ ఆదివాసీలు తమ సాంప్రదాయాలు పాటిస్తూ.. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాబన్న, ఎంపీటీసీ వెంకన్న యాదవ్, పల్లి ఎంపీటీసీ సోమన్న, విట్టల్, పునాజి, ప్రతాప్, సంజీవ్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని, ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు అన్నారు. ఆదివారం మండలంలోని కేస్లాగూడ, గిన్నేర, పిప్రి, వాల్గొండ గ్రామాల్లో పర్యటించారు. ఆదివాసీలతో కలిసి నృత్యం చేశారు.

మద్యం పట్టివేత

బోథ్: మండలంలోని భగత్‌సింగ్ చౌక్‌లో ఓ మహిళ సోమవారం అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై రాము తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడి చేయగా రూ. 2270 విలువైన మద్యం పట్టుకున్నామన్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: కాళోజీ నారాయణ రావు వర్ధంతి సందర్భంగా లంబాడాల ఐక్యవేదిక (లైవ్) ఆధ్వర్యంలో రోగులకు సోమవారం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వసంత్‌రావు, జిల్లా కన్వీనర్ వినోద్‌కుమార్, చౌహాన్ సేవాదాస్, రాజ్‌కుమార్, కరణ్, కిరణ్ పాల్గొన్నారు.

గోవర్ధన పూజ

బోథ్: మండలంలోని పార్డి(కె) గ్రామంలో సోమవారం గోవర్ధన పూజ నిర్వహించారు. గోమాతకు గ్రామస్తులు హారతులు ఇస్తూ.. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుస్సాడీ నృత్యం చేశారు. కార్యక్రమంలో గ్రామపటేల్ అమృత్‌రావు, ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న, దేవారీ జైతు, తుకారాం, సీతారాం, భీంరావ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో బీఆర్‌ఎస్ ప్రచారం

బోథ్/తలమడుగు: బోథ్ మండలంలోని నిగిని, బాబెర గ్రామాల్లో ఎంపీపీ తుల శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు తిరుగుతూ బీఆర్‌ఎస్ మేనిఫెస్టో వివరించారు. తలమడుగు మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అనిల్ జాదవ్ సమక్షంలో సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే దేవాపూర్‌లో బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ గోడం నగేశ్ ప్రచారం చేశారు.

క్షీరాభిషేకం

ఖానాపూర్: హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన మాదిగల విశ్వరూపసభలో ఎస్సీ వర్గీకరణపై కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రధాని చెప్పడంపై బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాని ప్రకటనను స్వాగతిస్తూ ఆదివారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తా వద్ద వారు ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రితీశ్ రాథోడ్, నాయిని సంతోశ్, దాసరి శ్రీనివాస్, నారపాక నర్సయ్య, గంగాధర్, శ్రావణ్, రాము, రవీందర్ రెడ్డి, సాయి, మనోజ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్, కోలాంగూడ, బీర్నంది గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం ఎస్సై లింబాద్రి పరిశీలించారు. ఈసందర్భంగా కేంద్రాల పరిధిలోని సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎర్వచింతల్ సర్పంచ్ గోపాల్, బీఎల్‌వో రవీందర్ తదితరులు ఉన్నారు.

డీఈవో తనిఖీ

దస్తురాబాద్: మండలంలో కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సోమవారం డీఈవో రవీందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనశాలకు వెళ్లి విద్యార్థుల ఆహారం పరిశీలించారు. అనంతరం ఎస్‌వో తిరుమలకు పలు సూచనలు చేశారు. అంతకుముందు విద్యార్థుల హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు.



బోథ్: దీపాలు వెలిగిస్తున్న సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు



తలమడుగు: గుస్సాడీ నృత్యం చేస్తున్న ఆదివాసీలు

ఊరూరా దీపావళి సంబురాలు

జిల్లా వ్యాప్తంగా దీపావళి సంబురాలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించి, ఇళ్లను విద్యుత్ దీపాలతో అలకరించారు. ఆవుపేడతో లక్ష్మీదేవి ప్రతిమ తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం చిన్నారులు, పెద్దలు అనే తేడా లేకుండా టపాసులు కాల్చి సందడిగా గడిపారు. పలు గ్రామాల్లో గుస్సాడీ నృత్యం చేస్తూ.. దీపావళి పండుగను జరుపుకున్నారు. – సాక్షి, నెట్‌వర్క్



ఇంద్రవెల్లి: దీపావళి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆదివాసీలు



తాంసి: అంబుగాంలో..



నేరడిగొండ: కాకర కాల్చుతున్న అనిల్ జాదవ్



తలమడుగు: నృత్యం చేస్తున్న మహిళలు

సచ్చే వరకు ప్రజలతోనే ఉంటా



మహిళలతో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న



సాంగ్వీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రామన్న

- ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జోగు రామన్న

జైనథ్: సచ్చే వరకు ప్రజలతోనే ఉంటానని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం మండలంలోని కౌఠ, సాంగ్వి, పెండల్‌వాడ, లేకర్‌వాడ, ఆకుర్ల, బాలాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెండల్‌వాడలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తన జీవితం ప్రజాసేవకే అంకితం చేసానన్నారు. అధికారంలోకి రాగానే మహిళలకు రూ. 3వేల జీవన భృతి, అందరికీ రూ. 5 లక్షల బీమా, రూ. 400లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, సర్పన్ లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్నిగ్రామాలకు బీటీరోడ్లు

బేల: బీఆర్‌ఎస్ హయాంలో అన్నిగ్రామాలకు బీటీ రోడ్లు వేశామని ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం మండలంలోని పోనాల, మారుతిగూడ, చంపెల్లి, భవానీగూడ(సి), బాలుగూడ, పిటగావ్, చప్రాల, సోన్‌కాస్, గణేష్‌పూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దండారీ ఉత్సవాల్లో భాగంగా ఆదివాసీ మహిళలతో కలిసి నృత్యం చేశారు. పల్లెల అభ్యున్నతికి కోట్లాది రూపాయలు వెచ్చించి, అభివృద్ధి చేశామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, జెడ్పీటీసీ అక్షిత సతీష్ పవార్, ఠాక్రే గంభీర్, జక్కుల మధుకర్, బండి సుదర్శన్, తన్వీర్ ఖాన్, కొరంగే జంగ్‌షా, సోనేరావు పాల్గొన్నారు.

'వాస్తవాలను జీర్ణించుకోని బీఆర్‌ఎస్ నాయకులు'



మాట్లాడుతున్న పతంగే బ్రహ్మానంద్

గుడిహత్నూర్: బీఆర్‌ఎస్ నాయకులు వాస్తవాలను జీర్ణించుకోవడం లేదని, అందుకే నాపై విమర్శలు చేస్తున్నారని జెడ్పీటీసీ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుంకిడిలో జరిగిన సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులను ఉద్దేశించి తాను మాట్లాడిన మాటలు వందశాతం వాస్తవాలన్నారు. నన్ను విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్ నాయకులు లేదన్నారు. దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీపీ భరత్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేంద్రే లక్ష్మణ్, మండలాధ్యక్షుడు జాడి సుభాష్, కరాడ్ బ్రహ్మానంద్, కోండిబా, శివ పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష'

ఇచ్చోడ/గుడిహత్నూర్/తాంసి/నేరడిగొండ: సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌కు శ్రీరామ రక్ష అని బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని నిర్మల్ బైపాస్ వద్ద కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. నెల16న నిర్వహించే సభకు 60 వేల మంది ప్రజలు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, గాడ్గే సుభాష్, కృష్ణకుమార్, లోక శిరీష్‌రెడ్డి, మోహరాజ్ అహ్మద్, సీహెచ్ భూమన్న, పాండురంగ్, రమేశ్ పాల్గొన్నారు. గుడిహత్నూర్ మండలంలోని కొలాంగూడలో నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో అనిల్‌జాదవ్ పాల్గొన్నారు. ఆదివాసీల ఆశీస్సులతో భారీ మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. తాంసి మండలంలోని వామన్‌నగర్, అంబుగాం, గిరిగాం, అట్నంగూడ, లీమ్‌గూడ గ్రామాల్లో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. అట్నంగూడలో అవ్వా దండం పెడుతున్న కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. నేరడిగొండ మండలంలోని తేజాపూర్, బుద్ధికొండ, రాజులతండా గ్రామాల్లో అనిల్‌జాదవ్ ప్రచారం నిర్వహించారు. అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు.



తాంసి: మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న అనిల్‌జాదవ్

'కమిటీ పేరిట మోసం చేస్తున్న కేంద్రం'

ఆదిలాబాద్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కమిటీ పేరిట మాదిగలను మోసం చేస్తోందని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మాట్లాడారు. 2014, 2018 ఎన్నికల సమయంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీల వర్గీకరణ చేస్తామని చెప్పి, బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడం లేదన్నారు. ఎన్నికల సమయంలో మళ్లీ మాదిగలను మోసం చేసేందుకు ప్రధాని మోదీ చూస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ డిసెంబర్‌లో జరగబోయే పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. సమావేశంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నక్క రాందాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి జువాక నర్సింలు, తార రవికుమార్, కత్తి గంగాధర్, ముక్కెర అశోక్, బట్టు మహేందర్, రమేశ్, భూమన్న పాల్గొన్నారు.

'కులాల మధ్య చిచ్చుపెట్టడం సరికాదు'

తలమడుగు: ఓట్ల కోసం ఐక్యతగా ఉన్న కులాల మధ్య చిచ్చు పెట్టడం సరికాదని మాల మహార్ సంఘ నాయకులు గంగన్న, రవి అన్నారు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మాదిగ విశ్వరూప సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎస్సీ వర్గీకరణపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అడెల్లు, తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

రాజకీయ లబ్ధి కోసమే వర్గీకరణ ప్రకటన

ఇచ్చోడ: రాజకీయ లబ్ధి కోసమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎస్సీ వర్గీకరణకు అనుకులంగా ప్రకటన చేశారని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ప్రకటనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వర్తమన్నూర్ సర్పంచ్ లక్ష్మణ్, మండల మాల సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్, లక్ష్మణ్, బొజ్జ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీతోనే సుపరిపాలన సాధ్యం

- బోథ్ బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావు



మాట్లాడుతున్న సోయం బాపూరావు

ఇచ్చోడ: బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమని బోథ్ బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావు అన్నారు. సోమవారం తలమద్రి, కోకస్‌మన్నూర్‌తో పాటు మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధి చెందాలేదన్నారు. కేంద్రం నిధులను తమ ప్రభుత్వమే మంజూరు చేసినట్లు ప్రజలకు నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. ప్రజలు ఆలోచించి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్ అమ్టే, కదం బాబారావు, జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్, కేంద్రే నారాయణ, సోమం వెంకటేశ్, అక్కెపెల్లి లక్ష్మణ్, బత్తుల అశోక్, పెరమండ్ల పోశెట్టి పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

గుడిహత్నూర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరాడ్ బ్రహ్మానంద్, నాయకులు మెస్రం జలంధర్, సంభాజీ చాటే, ఆనంద్ సోంటక్కేతో పాటు పలువురు బీజేపీలో చేరారు. వీరిని బోథ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపూరావు, ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్‌లు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనకు తెరపడిందని, ప్రజలు బీజేపీ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, జీవీ రమణ, జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, జాడి సుభాష్, కేంద్రే లక్ష్మణ్, సుధాకర్ ముండే పాల్గొన్నారు.

గిరిజనేతరులకు వ్యతిరేకం కాదు

సిరికొండ: గిరిజనేతరులకు వ్యతిరేకం కాదని బీజేపీ బోథ్ ఎమ్మెల్యే సోయం బాపూరావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొంత మంది ఎన్నికల్లో గెలిస్తే గిరిజనేతరులను ఇబ్బంది పెడతానని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పలువురు బీజేపీలో చేరాగా.. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండలాధ్యక్షుడు అమోల్, రఘురాం, గోడం దత్తు, బాలాజీ, అశోక్, గంగాధర్ పాల్గొన్నారు.

'ఇంటింటికీ సంక్షేమ పథకాలు'

కైలాస్‌నగర్: బీఆర్‌ఎస్ హయాంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాయని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని కొలిపుర, పంజేశా కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొండ గణేశ్, రఘు, సంతోష్, బాదన్ గంగన్న, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న జోగు ప్రేమేందర్

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

ఆదిలాబాద్: అన్నివర్గాల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధ్యేయమని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 12వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టిందన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్నను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పవన్, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆశల సౌధం కేసీఆర్

- ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్

ఖానాపూర్: ఇల్లులేని పేదల ఆశల సౌధం సీఎం కేసీఆర్ అని ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్దకు వెళ్లగా.. కాలనీవాసులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేగా గెలిచాక పేదలకు ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

జన్నారం: బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్‌లు అన్నారు. సోమవారం జన్నారం మండలంలోని పొనకల్, జన్నారం, లింగయ్యపల్లి, జువ్విగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే రూ. 400లకే సిలిండర్, రేషన్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ రూ. 5 లక్షల బీమా చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పొనకల్ ఉప సర్పంచ్ శ్రీనివాసగౌడ్, భరత్‌కుమార్, రాజేశ్వర్, శంకర్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.



ఘన స్వాగతం పలుకుతున్న కాలనీవాసులు

కూరగాయల సాగుపై ఆసక్తి



పొన్నారి శివారులో సాగుచేసిన టమాటా పంట

- ఆదర్శంగా నిలుస్తున్న పొన్నారి గ్రామస్తులు
- స్వయంగా మార్కెట్‌లో విక్రయం

తాంసి: వాణిజ్యపంటలు వరుసగా సాగు చేయడంతో సరైన దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. వాణిజ్య పంటలకు బదులు కూరగాయలు పండిస్తే లాభాలు పొందవచ్చని పలువురు రైతులు కూరగాయల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. తాంసి మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన రైతులు అధికంగా కూరగాయలు, ఆకుకూరలు పండిస్తూ.. అధిక లాభాలు సాధిస్తున్నారు. జిల్లా కేంద్రానికి పొన్నారి గ్రామం ఐదు కిలో మీటర్ల దూరం ఉండడంతో పండించిన కూరగాయలు మార్కెట్‌కు తరలించేందుకు సులువుగా ఉంటుంది. దీంతో కూరగాయలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. టమాటా, వంకాయ, క్యాలిఫ్లవర్, సోరకాయ, మిరప, బెండ, అలిచేంత, బబ్బెర, పాలకూర, కొత్తిమీర, మెంతి ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తున్నారు.

తక్కువ పెట్టుబడి.. అధిక లాభం..

పత్తి, సోయా, కంది పంటలతో ప్రతి ఏటా నష్టపోతున్నామని పొన్నారి రైతులు కూరగాయలు సాగు చేయడం మొదలు పెట్టారు. బోర్లు, వ్యవసాయ బావుల కింద సాగు చేసి, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. గ్రామంలో 50 మందికిపైగా రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారు. మార్కెట్లో మంచి ధర ఉండడంతో ఎలాంటి నష్టాలు లేకుండా కూరగాయలు పండిస్తున్నారు.

దళారులకు అమ్మి నష్టపోకుండా..

జిల్లా కేంద్రంలోని రైతుబజార్‌కు తీసుకెళ్లి స్వయంగా విక్రయిస్తున్నారు. గతంలో రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలు దళారులకు విక్రయించి నష్టపోయారు. దీంతో రైతులు తాము పండించిన కూరగాయలు గిట్టుబాటు ధరకు విక్రయించాలనే ఉద్దేశంతో స్వయంగా అమ్ముకుంటున్నారు. ప్రతిరోజు సాయంత్రం జిల్లా కేంద్రంలోని రైతుబజార్‌లో అమ్ముతున్నారు. దీంతో రైతులకు దళారుల బెడద లేకుండా నేరుగా విక్రయించుకోవడంతో మంచి ఆదాయం పొందుతున్నామని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గిట్టుబాటు అవుతోంది



కూరగాయల సాగుతో ప్రతీరోజు ఆదాయం వస్తోంది. టమాటాతో పాటు బీర, బంతిపూలు, చిక్కుడు, ఆకు కూరలు సాగు చేస్తున్నాను. ఇప్పటికే టమాట, బంతిపూలు విక్రంచాను. మరికొన్ని రోజుల్లో చిక్కుడు చేతికివస్తోంది. మార్కెట్లో విక్రయించడంతో ధర గిట్టుబాటు అవుతోంది.

– దాసరి స్వామి, రైతు, పొన్నారి

సబ్సిడీపై విత్తనాలు అందించాలి



కూరగాయల రైతులకు ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను, ఎరువులు అందించి ప్రోత్సహించాలి. ఒక్కోసారి మార్కెట్‌లో సరైన డిమాండ్ లేక గిట్టుబాటు ధర రావడం లేదు. అలాంటి పరిస్థితుల్లో పంటను అలాగే చేనులో వదిలేయాల్సి వస్తోంది. సబ్సిడీపై విత్తనాలు అందిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– అడెల్లు, రైతు, పొన్నారి

శాంతిభద్రతల పరిరక్షణకే కవాతు

తానూరు: అసెంబ్లీ ఎన్నికల వేళ శాంతిభద్రతల ప రిరక్షణకే పోలీసుల కవాతు నిర్వహిస్తున్నట్లు ము ధోల్ సీఐ వినోద్ అన్నారు. ఆదివారం మండలంలోని కోలూరు గ్రామంలో సీఐ ఆధ్వర్యంలో 50 మంది పోలీసులు వీధుల్లో కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగకుండా ధైర్యంగా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. గొడవలకు దిగి కోర్టుల చుట్టూ తిరగవద్దని ప్రజలకు సూచించారు. ఎస్సై సందీప్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కవాతు చేస్తున్న సీఐ వినోద్, సిబ్బంది